

నిర్మాణం పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోని గోపనపల్లి ఫ్లై ఓవర్


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 13 జూలై 2024 | HYDERABAD


## వర్షసూచన

సిటీబ్యూరో: గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసింది. శుక్రవారం రాత్రి 9గంటల వరకు వినాయక్‌నగర్‌లో అత్యధికంగా 2.50 సెం.మీ, చర్లపల్లిలో 2.40, కాప్రా, ఏఎస్ రావు నగర్‌లో 2.0, నేరెడ్‌మెట్, సఫిల్ గూడ, ఉప్పల్ రాజీవ్‌నగర్‌లో 1.50, మౌలాలి, బోయిన్‌పల్లి తదితర ప్రాంతాల్లో 1.0 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజులు పలు చోట్ల వానలు కురిసే అవకాశాలున్నట్లు చెప్పారు. మరో వైపు పగటి వేళ ఉక్కపోత తప్పడంలేదు.



సఫిల్‌గూడ లేక్ పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

# ఆ ఫ్లై ఓవర్‌ను ఎందుకు ప్రారంభించరు?



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): తమ ప్రభుత్వం నిర్మాణం పూర్తి చేసిన గోపనపల్లి ఫ్లైఓవర్‌ను ఎందుకు ప్రారంభించడం లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గోపనపల్లి ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే నల్లగండ్ల, గోపన్‌పల్లి, తెల్లాపూర్, చందానగర్‌వాసులకు ట్రాఫిక్ కష్టాలు తగ్గుతాయనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం వేగంగా ఆ ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేసిందన్నారు. ఆ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించకుండా కాంగ్రెస్ సర్కారు ప్రజలను ఇబ్బంది పెడుతున్నదని ఆయన ఎక్స్ వేదిక ద్వారా ధ్వజమెత్తారు. ప్రజల సమస్యలపై అవగాహన లేని అసమర్థ ప్రభుత్వం, నాయకత్వం ఉంటే ఇలాంటి పరిస్థితి వస్తుందన్నారు. ఢిల్లీకి షటిల్ సర్వీసులు కొట్టడానికి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్ల చుట్టూ తిరగటానికి సీఎం రేవంత్‌రెడ్డికి సమయం ఉంది కానీ, ఆ ఫ్లైఓవర్‌ను ప్రారంభించేందుకు సమయం లేకుండా పోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు ప్రజల సమస్యల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా వెంటనే ఆ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే ఆ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# డిస్కంలో ప్రక్షాళన

### నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు

### లైన్ ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు

### 10 సర్కిళ్లలో బదిలీలకు సన్నాహాలు

సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని పలు సర్కిళ్లలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు చేపట్టింది విద్యుత్ శాఖ. హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలో ఏడీఈ, ఏఈలకు షోకాజ్ నోటీసులు ఇవ్వగా, సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని నార్సింగ్ సెక్షన్ కార్యాలయంలో పనిచేసే లైన్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. గ్రేటర్‌లోని 10 సర్కిళ్ల పరిధిలో పనిచేస్తున్న ఉన్నతస్థాయి అధికారుల నుంచి కింది స్థాయి వరకు ఉన్నవారిని బదిలీలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. మాసబ్ ట్యాంక్ సమీపంలో చాచా నెహ్రూ పార్కు వద్ద ఉన్న 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక కారణంతో సరఫరాలో అంతరాయం జరిగింది. అయితే దీన్ని సరిచేసేందుకు గంటల తరబడి తీసుకున్నారని పెద్ద ఎత్తు ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ దీనిపై తగిన నివేదిక ఇచ్చి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ మోహన్ రెడ్డిని ఆదేశించారు. విచారణ జరిపిన ఎస్ఈ విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు వివరణ ఇవ్వాల్సిందిగా మాసబ్ ట్యాంక్ అసిస్టెంట్ ఇంజినీర్ నాగచైతన్య, మెహిదీపట్నం డివిజనల్ ఇంజినీర్ మల్లయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన నార్సింగ్ సెక్షన్ కార్యాలయం లైన్ ఇన్‌స్పెక్టర్(ఆపరేషన్స్) మనోహర్ సూర్తి బాబును సస్పెండ్ చేశారు.

# ఫీజు కడితేనే చదువు

## లేదంటే క్లాస్ బయటే!

### వేధిస్తున్న కాలేజీలు

> ఇంటర్ సెకెండ్ ఇయర్ చదువుతున్న ఓ అమ్మాయి.. తార్నాకలో పేరుగాంచిన ఓ కాలేజీలో ఎంపీసీ అభ్యసిస్తున్నది. ఫీజులో 80 శాతం చెల్లించింది. మరో 20 శాతం ఫీజు రెండు వారాల్లో చెల్లిస్తామని పేరెంట్స్ యాజమాన్యానికి తెలిపారు. కానీ రేపే ఫీజు తేవాలంటూ.. అందరి ముందు ఆ అమ్మాయిని క్లాస్ బయటకు పంపించారు. గంట సేపు క్లాస్‌లోకి రానివ్వకుండా బయటనే నిల్చోబెట్టారు.

**హైదరాబాద్‌లో** 395 ఇంటర్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో 275 ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. నగర శివార్లలో పుట్టగొడుగుల్లా వందలాది కాలేజీలు వెలిశాయి. చీకటి గదుల్లో, పురాతన భవనాలను సైతం అద్దెకు తీసుకొని కాలేజీలు నడిపిస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం ఉండటం లేదని విద్యానిపుణులు వాపోతున్నారు.

సిటీబ్యూరో, జూలై 12 ( నమస్తే తెలంగాణ): కాలేజీ బెల్ మోగి.. తరగతి గదిలోకి అడుగుపెట్టగానే మొదట వినబడే మాట.. 'ఫీజు చెల్లించారా? లేదా?' ఈ ప్రశ్నకు చెల్లించాం అనే సమాధానం రాకపోతే ఆ విద్యార్థికి క్లాస్‌లోకి అనుమతి ఉండదు. అలా అని ఇంటికీ పంపించరు. తరగతి గది బయటనే గంటల తరబడి విద్యార్థులను నిల్చోబెట్టి అవమానిస్తున్నారు. హైదరాబాద్‌లో కాలేజీల ఫీజుల దందా ఆకాశన్నంటుతున్నది. వేలం పాటలో సీట్లను అమ్ముకున్నట్టు విక్రయించేశారు. ఇప్పటికే కోట్ల రూపాయలు లాగేశారు. ఇవి చాలవన్నట్టు యూనిఫాం, సిక్, ఏసీ, సెక్లన్-ఏ, కోర్సు తదితర పేర్లతో పేరెంట్స్ నుంచి వేలాది రూపాయలు గుంజుతున్నారు. ఈ ఫీజుల దందాపై జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు ఏ మాత్రం దృష్టి సారించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే..

**-దాసరి ఒడ్డెన్న, జిల్లా ఇంటర్ బోర్డు అధికారి**

ఫీజుల వసూళ్లతో విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దు. నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తే నోటీసులు పంపిస్తాం. ఆ కాలేజీపై చర్యల కోసం ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేస్తాం. ఇప్పటికే కొన్ని కాలేజీలు ఫీజులను వసూలు చేయడం కోసం విద్యార్థులను తరగతి గది బయట నిల్చోబెడుతున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ఆ కాలేజీ గుర్తింపును రద్దు చేయడానికి సిఫారసు చేస్తాం.

# రాత్రి తూటా..పగలు లాఠీ!

సిటీబ్యూరో: అనుమానం వస్తే నగర పోలీసులు తూట దింపేస్తున్నారు... రాత్రి తూటాలకు పనిచెబుతూ.. పగలు లాఠీలకు పనిచెబుతున్నారు. సెల్‌ఫోన్ స్నాచింగ్‌లు పెరిగిపోతుండటంతో వాటిని కట్టడి చేయడానికి యాంటీ స్నాచింగ్ బృందాలను పోలీసులు రంగంలోకి దింపి.. రాత్రి వేళల్లో నిఘాను పెంచారు. ఈ టీమ్ రంగంలోకి దిగిన నెల రోజుల వ్యవధిలోనే నాలుగు సార్లు కాల్పులు జరిగాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలకు ఎక్కడ విఘాతం కలుగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నగరంలో శాంతి భద్రతల విషయంలో పోలీసులు చేతులెత్తేశారు. సెల్‌ఫోన్ స్నాచింగ్‌లు, హత్యలు చోటు చేసుకోవడంతో కండ్లు తెరిచిన ఉన్నతాధికారులు.. రాత్రి వేళల్లో యాంటీ స్నాచింగ్ టీమ్‌లను రంగంలోకి దింపి..నేరాలను అదుపు చేసే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆసిఫ్‌నగర్, చిలకలగూడ, సైదాబాద్ ప్రాంతాల్లో నేరగాళ్లను పట్టుకోవడం కోసం పోలీసులు కాల్పులు జరిపారు. తాజాగా, నాంపల్లి స్టేషన్ వద్ద జరిగిన కాల్పుల్లో ఓ అనుమానితుడికి తూటా దిగడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

# ఈ గవర్నమెంటు.. నాశనమైపోతుంది

### బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద పోలీసుల దౌర్జన్యం

### ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టిన పోతరాజులు, శివసత్తులు, జోగినీలు

సిటీబ్యూరో: 'మాకు తగిలిన దెబ్బలకు కలకల తగిలి.. గవర్నమెంట్ నాశనమై పోతదంటూ.. శాపనార్థాలు పెట్టారు పోతరాజులు, శివసత్తులు, జోగినీలు. 'పోతరాజులను గల్లపట్టారు.. శివసత్తులను గుర్తించకుండా లాగేశారు.. ఎస్సై ఎవరో.. సీఐ ఎవరో ఇష్టానుసారంగా ప్రజలపై లాఠీచార్జీ చేశారు. ఎవరినీ పడితే వాళ్లను జీపులో కూర్చోబెట్టి..దౌర్జన్యం చేశారు.. అమ్మవారి ఊరేగింపులో భక్తులు పాల్గొనకుండా పోలీసులు కట్టడి చేశార'ంటూ.. ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం అనంతరం గురువారం నిర్వహించిన రథోత్సవంలో పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. ఎవరిపై పడితే వారిపై లాఠీలు ఝుళిపించారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించిన భక్తులు.. ఎల్లమ్మ ఆలయం వద్ద జరిగిన కల్యాణం, రథోత్సవాల్లో ఇప్పటివరకు ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదని చెప్పారు. కాగా, పోలీసులు ఎందుకు అంత అత్యుత్సాహం ప్రదర్శించారు..? వేడుకలు జరగకుండా భక్తులపై ఎందుకు లాఠీలు ఝుళిపించారు..? అన్న విషయాలపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. వేడుకలు వైభవంగా జరగకుండా కట్టడి చేశారనే ఆరోపణలు వినిపిస్తుండగా, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతోనే కిందిస్థాయిలో ఉండే వారు రెచ్చిపోయారని కొందరు ఆరోపిస్తున్నారు. కాగా, కల్యాణోత్సవానికి హాజరైన మంత్రికే చేదు అనుభవం ఎదురైంది. ఓ మహిళా జర్నలిస్టులపై కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. వేడుకలు సరిగ్గా జరగకుండా ఉండేందుకు కుట్ర జరిగిందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆమె ఈ వ్యాఖ్యలు చేసిన తరువాత గురువారం రథోత్సవంలో పోలీసులు వీరంగం సృష్టించడం వెనుక ఆంతర్యం ఏమిటనేది తెలియాల్సి ఉంది.

# సఫిల్‌గూడ చెరువును సుందరీకరిస్తాం

### మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో/మల్కాజిగిరి, జూలై 12 (నమస్తే తెలంగాణ ): సఫిల్‌గూడ చెరువును సుందరీకరిస్తామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. కమిషనర్ ఆమ్రపాలి, స్థానిక కార్పొరేటర్ శ్రవణ్‌తో కలిసి మేయర్ సఫిల్‌గూడ లేక్ పార్కును పరిశీలించారు. ఈ పర్యటనకు హాజరు కానీ డీసీ రాజు, ఎంటమాలజీ విభాగం అధికారులపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం దీన్‌దయాళ్ కాలనీలో నాలాను పరిశీలించారు. మరోవైపు అక్రమ భవన నిర్మాణాలను ఉపేక్షించొద్దని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి అధికారులకు సూచించారు. శుక్రవారం అధికారులతో డెంగీ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

### ప్రతి ఫ్రైడే డ్రై డే

జీహెచ్ఎంసీ వ్యాప్తంగా శుక్రవారం డ్రై డే నిర్వహించడంతో పాటు సీజనల్ వ్యాధుల నివారణ, దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీల ప్రజలకు, పాఠశాలల విద్యార్థులకు వర్షాకాలం నిల్వ నీరుతో, ఇంట్లో పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణంతో దోమలు వ్యాప్తి చెంది, వాటి ద్వారా డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, విష జ్వరాలు ప్రబలుతాయని చెప్పారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.





